క్లుప్తంగా

విద్యార్థినికి సైకిల్ అందజేత



విద్యార్థినికి సైకిల్‌ను అందజేస్తున్న డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు

జంగారెడ్డిగూడెం : స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్న శ్యామా కర్ణికకు సోమవారం వారధి ట్రస్ట్ ఆధ్వర్యంలో సైకిల్ అందజేశారు. సింగంశెట్టి సత్యరాజ్, సుజాత దంపతుల కుమార్తె ఊహా మాధవి జన్మదినం సందర్భంగా బహూకరించిన సైకిల్‌ను ట్రస్ట్ ఆధ్వర్యంలో మాజీ చైర్మన్ కరాటం రాంబాబు చేతుల మీదుగా విద్యార్థినికి అందజేశారు. స్థానిక నాల్గవ వార్డ్ ఇందిరానగర్ కాలనీలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ వారధి ట్రస్ట్ వ్యవస్థాపకులు, కౌన్సిలర్ వలవల తాతాజీ చేస్తున్న సేవాకార్యక్రమాలను అభినందించారు. మల్లాబత్తుల మునేశ్వర రావు, కటారి సీతారాంబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు



విజేతలుగా నిలిచిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని ఏపీ ప్రభుత్వ యువజన వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలో సెట్ వెల్ ఈ నెల 7న ఏలూరులోని హేలాపురి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి వక్తృత్వం, క్విజ్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు విజయభేరి మోగించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ప్రసాదబాబు తెలిపారు. విద్యార్థులు వక్తృత్వ పోటీలో మొదటి స్థానము, క్విజ్ పోటీలో ద్వితీయ స్థానాన్ని గెలుపొందారన్నారు. ఈ సందర్భంగా మూడవ సంవత్సరం బీఏ విద్యార్థులు జి.కుమార్ రాజా, ఎస్.కిరణ్ కుమార్, ఎం.భానుప్రకాష్, ఎం.పల్లవి, కె.భవానిలను ఆయన అభినందించారు.

రావికంపాడులో ఫాతిమా షేక్ జయంతి

కామవరపుకోట : రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఫాతిమా షేక్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఉమ్మడి భీమరాజు, తెలుగు ఉపాధ్యాయులు బిరుదుగడ్డ నాగేశ్వరరావు మాట్లాడుతూ మహిళా విద్య కోసం ఉద్యమించిన మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే దంపతులతో కలసి సామాజిక సేవకు నడుంగట్టిన మహనీయరాలు ఫాతిమా షేక్ అని అన్నారు. పూలే దంపతులకు ఆశ్రయం ఇచ్చి ఆదుకోవడమే కాకుండా, తాను కూడా లౌకిక విద్యను నేర్చుకుని సావిత్రిబాయితో కలసి విద్యాబోధన చేసిన తొలి ముస్లిం ఉపాధ్యాయురాలు అని పేర్కొన్నారు. ఆమెను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని వినతి

కుక్కునూరు : మండలంలోని మారేడుబాక గ్రామంలో ఉపాధి హామీ పనులలో జరిగిన అవకతవకలపై విచారణ చేయాలని కోరుతూ సోమవారం మారేడుబాక గ్రామస్తులు ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. గ్రామానికి చెందిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ పనికి వెళ్లని వారి సంతకాలు ఫోర్జరీ చేసి మస్టర్ వేసి వేతనాన్ని డ్రా చేశాడని, స్థానికంగా ఉండని వారికి, ఒకే కుటుంబానికి చెందిన 18 ఏళ్లు నిండిన యువకులకు విడిగా జాబ్‌కార్డులు ఇచ్చి వేతనాన్ని చెల్లించాడని, మారేడుబాక, గోపరాజుగూడెం గ్రామాలలో వర్షాలు పడి చెరువులు నిండిన తరువాత సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో చెరువులో పీటీ పనులు జరిగినట్టు రికార్డులు సృష్టించి డబ్బులు డ్రా చేశారని పేర్కొన్నారు. ఇదే విషయాన్ని గ్రామంలో జరిగిన సోషల్ ఆడిట్‌నందు చెప్పినట్టు వివరించారు. అవకతవకలపై తగిన ఆధారాలను అందిస్తున్నట్టు చెప్పారు. సమగ్ర విచారణ చేసి ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓకు వివరించారు.

ఎండీ ఉమర్ అలీకి అబ్దుల్ కలాం అవార్డు



అవార్డు అందుకుంటున్న ఉమర్ అలీ

జంగారెడ్డిగూడెం : పట్టణానికి చెందిన సంఘ సేవకులు ఎండీ ఉమర్‌అలీ ఏపీజే అబ్దుల్ కలాం అవార్డును అందుకున్నారు. ఈ నెల 8న ఏలూరు రెవెన్యూ భవన్‌లో గౌతమ బుద్ధా ప్రచార ట్రస్టు ద్వితీయ అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఉమర్‌అలీను శాలువ, పూలదండతో సత్కరించారు. ఎండీ ఉమర్‌అలీ మాట్లాడుతూ ప్రజల కోసం నిస్వార్థంగా అందిస్తున్న సేవలను గుర్తించి తనను ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు చెప్పారు. ఆర్‌సీఎం వికార్ జనరల్ ఫాదర్ బాల చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నట్లు వివరించారు. ట్రస్ట్ చైర్మన్ ఎం.ఇస్సాకు, డి.అబ్రహం, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ తదితరులు ఉమర్ అలీకి శుభాకాంక్షలు తెలిపారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ లబ్ధి

- గడపగడపనా విశేష ఆదరణ
- వీరన్నపాలెంలో పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు
- జంగారెడ్డిగూడెంలో పాల్గొన్న చింతలపూడి ఎమ్మెల్యే ఎలీజా



వీరన్నపాలెంలో సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు



జంగారెడ్డిగూడెంలో ప్రజల అభిప్రాయాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఎలీజా

బుట్టాయగూడెం : వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నామని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. సోమవారం బుట్టాయగూడెం సచివాలయం-2 పరిధిలో గల మర్రిగూడెం, వీరన్నపాలెం, సూర్యవారిగూడెం, బీసీ కాలనీ, రెడ్డిగణపవరం పంచాయతీ పరిధిలోని రామారావుపేట సెంటర్ గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలరాజు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అదేవిధంగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని చెప్పారు. గడచిన మూడేన్నరేళ్ల పాలనలో సీఎం జగన్ ఎన్నో సంస్కరణలను తీసుకువచ్చారని చెప్పారు. సచివాలయం, వలంటీర్ వ్యవస్థలకు దేశంలోనే మంచి పేరు వచ్చిందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మొడియం రామతులసి, సర్పంచ్‌లు తెల్లం వెంకాయమ్మ, బన్నే బుచ్చిరాజు, సరియం చల్లయ్య, మడకం రామలక్ష్మి, కె.వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ తెల్లం రమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీహరి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మురళీ కృష్ణ, ఏఓ బి.సుమలత, వెలుగు ఏపీఎమ్ పద్మావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు తెల్లం దేవరాజు, యాండ్ర రవి, బానోతు కృష్ణ నాయక్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మంచి నీటి ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన

మండలంలోని వీరన్నపాలెంలో సుమారు రూ.28 లక్షల వ్యయంతో నిర్మించనున్న వాటర్ ట్యాంక్ నిర్మాణం పనులకు ఎమ్మెల్యే తెల్లం బాలరాజు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తగు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు.

వలంటీర్‌లు, సచివాలయ సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలి

వలంటీర్‌లు, సచివాలయ సిబ్బంది ప్రజలతో మమేకమై చిత్తశుద్ధితో సేవలందిస్తూ పనిచేయాలని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. వీరన్నపాలెంలో సచివాలయ, ఉద్యోగులు, వలంటీర్‌లతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ఉన్నతమైన ఆలోచనతో సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారని, దీనివల్ల ఎంతో మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభించాయని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు సక్రమంగా అమలు చేస్తూ మంచిపేరు తెచ్చుకోవాలని వారికి సూచించారు.

జంగారెడ్డిగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం

జంగారెడ్డిగూడెం : సంక్షేమం, సుపరిపాలనే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బలహీన వర్గాల అభివృద్ధికి చేస్తున్న కృషికి హర్షిస్తూ ప్రజలు పూల వర్షం కురిపిస్తున్నారని ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా అన్నారు. జంగారెడ్డిగూడెం 27వ వార్డులో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఇంటి వద్ద ప్రజలు సంతోషంగా ఆహ్వానిస్తూ ఆశీర్వదిస్తున్నారన్నారు. ప్రజలు చాలా సంతోషంగా మాకు ఈ పథకాలు అందాయని చెబుతూ, రాష్ట్ర ప్రభుత్వ పాలను మెచ్చుకుంటున్నారన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మూడున్నర సంవత్సరాల కాలంలో ప్రజలకు చేసిన మేలును బేరీజువేసుకుంటూ, ప్రజలకు ఎలా లబ్ధి చేకూరిందో తెలుసుకుంటూ ముందుకు నడుస్తున్నామన్నారు. అలాగే ప్రభుత్వం ఏ కార్యక్రమాలు చేపట్టాలనే విషయాన్ని ప్రజలను అడిగి సలహాలు, సూచనలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పీపీఎస్ చంద్రరావు, మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, స్థానిక కౌన్సిలర్ నేట్రు సుబ్బలక్ష్మి, కమిషనర్ భవాని ప్రసాద్, కౌన్సిలర్లు చిటికెల అచ్యుతరామయ్య, ఎల్వీఆర్, సంకు సురేష్, ఉగ్గం ప్రసాద్, తడికిమల్ల మురళి, కో-ఆప్షన్ సభ్యులు వెంప ఐజాక్, సొసైటీ డైరెక్టర్ చిప్పాడ వెంకన్న, హాస్పటల్ డైరెక్టర్ బావన ఋషి, సచివాలయం కన్వీనర్ బూరుగుపల్లి సూరిబాబు, నిమ్మలగూడెం మనికె వెంకటలక్ష్మి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు బత్తిన చిన్న, నేట్రు గణేష్, తల్లాడ సంజయ్, షేక్ అమీర్, అడపాల రాంబాబు, చింత అనిల్ కుమార్ గౌడ్, పెసరకంటి త్రిమూర్తులు, కళ్యాణ వర్మ, గంజి వినోద్, మహమ్మద్ కబీర్, సచివాలయం సిబ్బంది, వలంటరీలు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు న్యాయం చేయాలి

కుక్కునూరు : ఉమ్మడి రాష్ట్రంలో 2008వ సంవత్సరంలో ఇందిరాసాగర్ ప్రాజెక్ట్ ముంపులో సేకరించిన భూమిని 2017 పోలవరం ప్రాజెక్ట్ ఆర్‌అండ్ ఆర్ సర్వేలో లచ్చిగూడెం గ్రామస్తులకు భూమికి, భూమి క్రింద ఇవ్వడం అన్యాయమని సీపీఐ ఎం ఎల్ ప్రజాపందా జంగారెడ్డిగూడెం డివిజన్ కమిటీ కార్యదర్శి షేక్ గౌస్ అన్నారు. సోమవారం సీపీఐ ఎం ఎల్ ప్రజాపందా మండల కమిటీ సమావేశం లచ్చిగూడెం గ్రామంలో నిర్వహించారు. గౌస్ మాట్లాడుతూ, 2017వ సంవత్సరంలో పోలవరం ఆర్‌అండ్‌ఆర్ సర్వేలో లచ్చిగూడెం గ్రామానికి చెందిన 33 గిరిజన కుటుంబాలకు 70 ఎకరాల భూమిని భూమికి, భూమి క్రింద అప్పగించారని కాని ఆ భూమి ఇందిరాసాగర్ ప్రాజెక్ట్‌లో ముంపులో ఉందన్నారు. ముంపులో సేకరించిన భూమినే మరల గిరిజనులకు ఇచ్చారని, ఆ భూములను రద్దు చేసి మరోచోట గిరిజనులకు భూమి ఇవ్వాలని కోరారు. లచ్చిగూడెం గ్రామాన్ని 41.15 కాంటూర్ పరిధిలో చేర్చి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ ఎం ఎల్ ప్రజాపందా కుక్కునూరు మండల కార్యదర్శి బాసిన సత్యనారాయణ, కంగాల కల్లయ్య, మచ్చ లక్ష్మయ్య మడివి ఊసయ్య, మడివి లక్ష్మయ్య, సున్నం భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

కోడికత్తులు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న కోడికత్తులు, నిందితుడు గంగాధర్‌తో టి.నరసాపురం ఎస్సై సతీష్‌కుమార్, సిబ్బంది

టి.నరసాపురం : ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ, డీఎస్పీ లతాకుమారి ఆదేశాల మేరకు కోడి పందేల నిర్వహణను అడ్డుకునేందుకు టి.నరసాపురం మండలంలో సోమవారం తనిఖీలు నిర్వహించినట్లు ఎస్సై కె.సతీష్‌కుమార్ తెలిపారు. తిరుమలదేవిపేట గ్రామంలో తనిఖీలు నిర్వహించి బాలిన గంగాధర్‌రావు వద్ద ఉన్న 60 కోడికత్తులు స్వాధీనం చేసుకుని అతడ్ని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చింతలపూడి : ఎస్పీ రాహుల్‌దేశ్ శర్మ ఆదేశాల మేరకు చింతలపూడి కోడి పందాలు అరికట్టేందుకు గట్టి నిఘాపెట్టినట్లు ఎస్సై హరికృష్ణ తెలిపారు. ఈ నేపథ్యంతో సోమవారం తమకు అందిన సమాచారం మేరకు చింతంపల్లి గ్రామంలో తనిఖీలు నిర్వహించి, పసుపులేటి కాంతారావు వద్ద ఉన్న 125 కోడికత్తులను స్వాధీనం చేసుకుని, అతన్ని అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చిన్న వయసులో పెళ్లి చేయడం నేరం

ఏలూరు రూరల్: చిన్న వయస్సులో బాలికలకు పెళ్లి చేయడం చట్టరీత్యా నేరమని తహసీల్దార్ బి.సోమశేఖర్ అన్నారు. పెళ్లి చేసుకోవడం ఇష్టం లేక కొద్దిరోజుల క్రితం వంగాయగూడెం ప్రాంతానికి చెందిన ఓ 17 సంవత్సరాల బాలిక ఇంటి నుంచి పారిపోయింది. పోలీసులు బాలికను వెతికి పట్టుకుని సోమవారం తహసీల్దార్ ముందు హాజరుపరిచారు. తహసీల్దార్ బాలికతో పాటు తల్లిని విచారించారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుకుంటుంటే పెళ్లి చేస్తానని తల్లి చెప్పడంతో పారిపోయానని బాలిక ఆవేదన వ్యక్తం చేసింది. దీనిపై తహసీల్దార్ స్పందిస్తూ 18 ఏళ్లు నిండకుండా, బాలిక ఇష్టం లేకుండా పెళ్లి చేయడాన్ని చట్టం సమర్థించదని తెలిపారు. మరోసారి పెళ్లి ప్రయత్నం చేస్తే పోలీసు కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా ప్రజాసంకల్ప యాత్ర వేడుకలు



కన్నాపురంలో వైఎస్సార్ విగ్రహం వద్ద వేడుకలు నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

జంగారెడ్డిగూడెం : ప్రజా సంకల్ప పాదయాత్ర చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం జంగారెడ్డిగూడెం పట్టణంలో వైఎస్సార్ సీపీ నాయకులు వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా పాల్గొని మాట్లాడారు. సంక్షేమ పాలనకు మార్గాన్ని అందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప పాదయాత్ర చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ మహాఘట్టం అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్‌ను ఎలీజా కట్ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పీపీఎస్ చంద్రరావు, మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, కౌన్సిలర్ నేట్రు సుబ్బలక్ష్మి, కమిషనర్ భవాని ప్రసాద్, కౌన్సిలర్లు చిటికెల అచ్యుతరామయ్య, ఎల్వీఆర్, సంకు సురేష్, ఉగ్గం ప్రసాద్, తడికిమల్ల మురళి, కో-ఆప్షన్ సభ్యులు వెంప ఐజాక్, సొసైటీ డైరెక్టర్ చిప్పాడ వెంకన్న, హాస్పటల్ డైరెక్టర్ బావన ఋషి, సచివాలయం కన్వీనర్ బూరుగుపల్లి సూరిబాబు, నిమ్మలగూడెం మనికె వెంకటలక్ష్మి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజాసంకల్ప యాత్ర వేడుకలు

కొయ్యలగూడెం : ప్రజా సంకల్ప పాదయాత్ర వార్షికోత్సవం సోమవారం మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. కొయ్యలగూడెం వైఎస్సార్ నగర్‌లో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఎంపీపీ గంజిమాల రామారావు, పట్టణ కన్వీనర్ సంకు కొండ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అచ్యుతాపురంలో ముమ్మిడి రాంబాబు, జి.మూర్తి, సీహెచ్ దుర్గాప్రసాద్ అచ్యుతగోపి, వైఎస్సార్ విగ్రహం వద్ద ప్రజా సంకల్ప పాదయాత్ర వేడుకలు నిర్వహించి స్వీట్లు పంపిణీ చేశారు. గవరవరంలో చీమకుర్తి సత్యనారాయణ ఆధ్వర్యాన, మంగపతిదేవీపేటలో చిడిపిరవి, తేలే శ్రీను, అంకాలగూడెంలో మోపిదేవి వాసు, ఏలేటి చంద్రం ఆధ్వర్యాన, సీతంపేటలో తోట జయబాబు, సరిపల్లిలో మందపాటి రామకృష్ణ, వేదాంతపురంలో గేలం త్రివిక్రమ సోమరాజు, యర్రంపేటలో విగ్గిన రామకృష్ణల ఆధ్వర్యాన కార్యక్రమాలు నిర్వహించారు.

క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం



జంగారెడ్డిగూడెంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీఎస్పీ సత్యనారాయణ



చింతలపూడిలో షటిల్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన సీఐ మల్లేశ్వరరావు

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు ఘనంగా ముగిశాయి. డీఎస్పీ కేవీ సత్యనారాయణ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. క్రీడా పోటీల్లో ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలు శారీరిక, మానసిక ధారుఢ్యాన్ని పెంచడంతో పాటు ఉన్నత అవకాశాలు సృష్టిస్తాయన్నారు. జూదక్రీడలు జీవితాన్ని నాశనం చేస్తాయన్నారు. కావున సంక్రాంతి సమయంలో యువత కుటుంబసభ్యులతో పండుగను చేసుకోవాలన్నారు. డీఎస్పీ కేవీ సత్యనారాయణ మాట్లాడుతూ ఎస్పీ రాహుల్‌దేశ్ శర్మ ఆదేశాల మేరకు జంగారెడ్డిగూడెం సీఎస్‌టీఎస్ కళాశాల ప్రాంగణంలో మూడు రోజుల పాటు సంక్రాంతి సంబరాలు నిర్వహించామన్నారు. విజేతలకు నవభారత్ పామాయిల్ ఫ్యాక్టరీ యాజమాన్యం సహకారంతో బహుమతులు అందించామన్నారు.

విజేతలు వీరే

కబడ్డీ పురుషుల విభాగంలో పి.రాజేష్ టీమ్ (సీఎస్‌టీఎస్ డిగ్రీ కళాశాల) ప్రథమస్థానం, ఆర్.చరణ్ టీమ్ (త్రివేణీ డిగ్రీ కళాశాల) ద్వితీయ బహుమతి గెలుచుకోగా, మహిళల విభాగంలో ప్రథమ, ద్వితీయ బహుమతులు సీఎస్‌టీఎస్ కళాశాలకు చెందిన ఎస్.అనితటీమ్, ఎం.మాధవిటీమ్లు గెలుచుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. వాలీబాల్ పురుషులు, మహిళల విభాగంలో, రంగోలి పోటీల్లో సీఎస్‌టీఎస్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపగా, పురుషుల విభాగంలో టి.లక్ష్మణరావు టీమ్ ప్రథమ బహుమతి, కె.అజయ్ టీమ్ ద్వితీయ బహుమతి, మహిళల విభాగంలో వి.ప్రవల్లిక టీమ్ ప్రథమ బహుమతి, బి.ఢిల్లీశ్వరి ద్వితీయ బహుమతి, రంగోలిలో బి.దిల్లీశ్వరి ప్రథమ బహుమతి, ధరణి ద్వితీయ బహుమతి, ఎస్.శిరీష తృతీయ బహుమతి గెలుచుకున్నారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.5వేలు, తృతీయ బహుమతి 3వేలు అందించినట్లు చెప్పారు. కాగా రంగోలిలో విజేతలుగా నిలిచిన గ్రామ మహిళా పోలీసులు డీవీ సునీత(మైసన్నగూడెం), డి.అనూష (ఎ.పోలవరం), జీవీఎల్‌కుమారి (జంగారెడ్డిగూడెం)లకు చందనా బ్రదర్స్ వారు పట్టు చీరలను బహుమతులుగా అందించినట్లు డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో సీఐ బాలసురేష్‌బాబు, ఎస్సై ఎం.సాగర్‌బాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సాంప్రదాయ పండుగ సంక్రాంతి

చింతలపూడి : తెలుగువారి సాంప్రదాయ పండుగ సంక్రాంతి అని, ప్రతి ఒక్కరూ సంక్రాంతి విశిష్టతను తెలుసుకుని, విలువలను గౌరవిస్తూ పండుగను నిర్వహించుకోవాలని తహసీల్దార్ కృష్ణజ్యోతి, ఎస్సై డి.హరికృష్ణ అన్నారు. చింతలపూడి మండలం యర్రగుంటపల్లిలో సోమవారం సంక్రాంతి ముద్దు, జూదాలు వద్దు అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ గ్రామంలోని యువత సంక్రాంతి పేరుతో జూదాలు, పందేల వైపు వెళ్లకుండా కుటుంబ సభ్యులతో వేడుకను నిర్వహించుకోవాలన్నారు. గ్రామాల్లోని పెద్దలు యువతకు సరైన మార్గదర్శనం చేయాలని సూచించారు. యువత పెడదోవ పట్టకుండా వాలీబాల్ పోటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.

షటిల్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన సీఐ

సంక్రాంతి నేపథ్యంలో యువత జూదక్రీడలు, కోడిపందేల వైపు వెళ్లకుండా సాంప్రదాయ క్రీడలను ఏర్పాటు చేసినట్లు సీఐ మల్లేశ్వరరావు తెలిపారు. చింతలపూడిలో సోమవారం షటిల్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగ సమయంలో కుటుంబంతో కలిసి పండుగను నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై హరికృష్ణ పాల్గొన్నారు.

సంక్రాంతి క్రీడా పోటీలు ప్రారంభం

చింతలపూడి : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చింతలపూడి మండల పరిధిలో సంక్రాంతి క్రీడా సంబరాలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కృష్ణజ్యోతి తెలిపారు. చింతలపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో సోమవారం క్రీడా సంబరాల్లో భాగంగా వాలీబాల్ పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ 9, 10 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించే ఈ వాలీబాల్ పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతిగా రూ. 5వేలు, ద్వితీయ బహుమతిగా రూ.4వేలు అందజేయనున్నట్లు చెప్పారు.

రేపటి నుంచి వాలీబాల్ పోటీలు

లింగపాలెం : సంక్రాంతి పండుగ సందర్భంగా యువత జూద క్రీడలకు దూరంగా ఉండేందుకుగాను పోలీసుల ఆధ్వర్యంలో ఈనెల 11, 12 తేదీల్లో వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు ధర్మాజీగూడెం ఎస్సై పి.చెన్నారావు తెలిపారు. పోటీలు శింగగూడెం హైస్కూల్‌లో నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల యువత ధర్మాజీగూడెం పోలీస్ స్టేషన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని ఎస్సై చెప్పారు.

నేడు సంక్రాంతి ముగ్గుల పోటీలు

కొయ్యలగూడెం : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మంగళవారం ముగ్గుల పోటీ, సంక్రాంతి సంబరాలను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. కొయ్యలగూడెం చింతాలమ్మగుడి వీధిలోని వాటర్ టాంక్ రామాలయం వద్ద ముగ్గుల పోటీ మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రారంభించనున్నారు. వైఎస్సార్‌సీపీ నేత నూకాల రాము, సౌజన్యంతో రూ.20వేలు విలువైన బహుమతులను విజేతలకు ప్రదానం చేయనున్నారు. రేపల్లెవాడ మేధ స్కూల్‌లో ప్రిన్సిపాల్ నల్లూరి మధు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నారు. కార్యక్రమాలకు వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులతో పాటు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే తెల్లం బాలరాజు హాజరు కానున్నారు.

పండుగ వేళ క్రీడలకు ప్రోత్సాహం

కొయ్యలగూడెం : సంక్రాంతి పండుగ వేళ యువత వివాద రహిత క్రీడలను ప్రోత్సహించాలని పోలవరం డీఎస్పీ కె.లతాకుమారి పిలుపునిచ్చారు. కొయ్యలగూడెంలో మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆమె సోమవారం ప్రారంభించారు. ఎస్సై జీజే విష్ణువర్ధన్ ఆధ్వర్యాన మూడు రోజుల పాటు క్రీడా పోటీలను నిర్వహిస్తారన్నారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖను ఎంపీపీ గంజిమాల రామారావు, సర్పంచ్ ముప్పిడి విజయ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వర రావు అభినందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దాసరి విష్ణు, మట్టా సత్తిపండు, సంకు కొండ, గంటా శ్రీను, ఎస్కే బాజీ తదితరులు పాల్గొన్నారు.

ధర్మాజీగూడెం వాసవీ క్లబ్ అధ్యక్షుడిగా గంగాధరరావు

లింగపాలెం : ధర్మాజీగూడెం వాసవీ క్లబ్, వనిత డైమండ్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం సోమవారం ధర్మాజీగూడెంలో నిర్వహించారు. వాసవీ క్లబ్ అధ్యక్షుడిగా సోమిశెట్టి గంగాధరరావు, కార్యదర్శిగా కె.పురుషోత్తం, కోశాధికారిగా సమయమంతుల బలరామకృష్ణ, వనిత డైమండ్ క్లబ్ అధ్యక్షులుగా కందుల రత్నమాల, కార్యదర్శిగా కొలిపర్తి పుష్పకుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇంటర్నేషనల్ జాయింట్ కార్యదర్శి బోనగిరి ప్రకాశరావు నూతన కార్యవర్గంచే ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో జాయింట్ కార్యదర్శి పత్తి విశ్వనాథ్‌కుమార్, వాసవీ క్లబ్, ఆర్యవైశ్య సభ్యులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో తాటాకిల్లు దగ్ధం



దిబ్బగూడెంలో దగ్ధమైన తాటాకిల్లు

బుట్టాయగూడెం (జీలుగుమిల్లి) : అంకన్నగూడెం సమీపంలో ఉన్న దిబ్బగూడెం గ్రామంలో సోమవారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో చోడెం రాములమ్మకు చెందిన తాటాకిల్లు దగ్ధమైంది. కుటుంబ సభ్యులు కూలి పనులకు వెళ్లిన సమయంలో ఇంటి వద్ద ఉన్న చిన్న పిల్లలు పొయ్యి వెలిగించిన సమయంలో ప్రమాదవశాత్తూ మంటలు చెలరేగి ఒక్కసారిగా ఇంటిమీదకు వ్యాపించెందడంతో ఈ ప్రమాదం జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఇంట్లోని సామాన్లతో పాటు విలువైన సర్టిఫికెట్‌లు కాలిపోయి కట్టుబట్టలతో నిరాశ్రయులుగా మిగిలారు. రాములమ్మకు పూర్తి సహకారం అందించాలని గ్రామస్తులు కోరారు.

జూద క్రీడలతో కుటుంబాలు విచ్ఛిన్నం




తడికలపూడి గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్, ఎస్సై

కామవరపుకోట : కోడిపందేలు, పేకాట, గుండాట వంటి జూద క్రీడలతో కుటుంబాలు ఆర్థికంగా నష్టపోయి విచ్ఛిన్నమవుతున్నాయని తహసీల్దార్ డీవీ సత్యనారాయణ, తడికలపూడి ఎస్సై కె.వెంకన్న అన్నారు. మండలంలో తడికలపూడి గ్రామంలో సంక్రాంతి పురస్కరించుకొని జూదం నిర్వహించకుండా గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ డీవీ సత్యనారాయణ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ వేళ కుటుంబ సభ్యులతో, బంధువులతో సంతోషం గడపాలన్నారు. ఎస్సై కె.వెంకన్న మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడైనా కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. యువత జూదం వీడి సాంప్రదాయ క్రీడలు వైపుమొగ్గు చూపాలన్నారు.

నేటినుంచి వాలీబాల్ టోర్నమెంట్

కామవరపుకోట : సంక్రాంతి పండుగ పురస్కరించుకుని తడికలపూడి పోలీస్ స్టేషన్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు తడికలపూడి ఎస్సై కె.వెంకన్న సోమవారం తెలిపారు. ఈ నెల 10, 11 తేదీల్లో మండల స్థాయి మెగా ఓపెన్ వాలీబాల్ స్థానిక వీరభద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్నామన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.15 వేలు, రూ.7,500, రూ.2,500 విలువ గల వాలీబాల్, నెట్ ఇస్తామన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ టీమ్ పేర్లను నమోదు చేసుకోవడానికి 94410 43936 నంబరులో సంప్రదించాలని కోరారు.

అలరించిన పౌరాణిక నాటకం



కృష్ణ రాయబారం పౌరాణిక నాటకంలోని సన్నివేశం

ఏలూరు (ఆర్‌ఆర్ పేట): స్థానిక రామచంద్రరావు పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామి వారి నిత్య హోమాలు, నిత్య కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించి స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేశారు. సాయంత్రం నిర్వహించిన పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. సంగీత కళాకారిణి తాడిమేటి శుభ నిర్వహించిన భక్తి సంగీత విభావరి విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం హరి శ్రీనివాస శాస్త్రి రావణ వధ అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. రాత్రి 7.30 గంటలకు శ్యామలాంబ కళానికేతన్ ఆధ్వర్యంలో ఎస్.సీతారామయ్య బృందం ప్రదర్శించిన శ్రీ కృష్ణ రాయబారం పౌరాణిక నాటకంలోని పడక సీను భక్తులను అలరించింది. అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు పూజలు చేయగా, ట్రస్ట్ బోర్డు చైర్మన్ శ్రీనివాస్, ఈవో రవిశంకర్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.